జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 92 14-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

- ఏప్రిల్ 20న కేసీఆర్ అధ్యక్షతన జగిత్యాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కేటీఆర్ వెల్లడి
- ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించబోతున్నట్లు ప్రకటన
- మే, జూన్ నెలల్లో ప్రత్యక్ష పోరాటాలను ప్రారంభించనున్నట్లు వెల్లడి

2లో



## ఆ నౌకలనే అడ్డుకుంటున్నాం: అమెరికా సెంట్ కామ్ ప్రకటన

- ఇరాన్ ఓడరేవులపై అమెరికా పూర్తిస్థాయి సైనిక దిగ్బంధనం
- ఆపరేషన్‌లో పాల్గొంటున్న 10,000 మంది సైనికులు, 12కు పైగా యుద్ధనౌకలు
- తొలి 24 గంటల్లో 6 వాణిజ్య నౌకలను వెనక్కి పంపిన బలగాలు
- ఏ దేశ నౌక అయినా ఇరాన్ పోర్టులకు వస్తే నిలిపివేస్తామని స్పష్టీకరణ

2లో



## మహిళా రిజర్వేషన్లతో చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం

- మహిళల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్'సాధ్యం
- మీ స్థానిక ఎంపీలకు లేఖ రాయండి
- ప్రత్యేక సమావేశాల్లో పాల్గొనేలా ప్రోత్సహించండి
- మహిళలకు ప్రధాని మోదీ లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభలకు జరిగే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేస్తే భారత ప్రజాస్వామ్యం మరింత బలోపేతమై, చైతన్యవంతంగా మారుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు కోటా అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మహిళలకు మంగళవారం లేఖ రాశారు. లేఖను 'ఎక్స్'లో పోస్టుచేశారు. విధానాల రూపకల్పన, కీలక నిర్ణయాల్లో మహిళామణులు క్రియాశీలక పాత్ర పోషిస్తే 'వికసిత్ భారత్'దిశగా మన ప్రయాణం మరింత బలం పుంజుకుంటుందని వెల్లడించారు. అందువల్ల మన అభివృద్ధి పథానికి మరింత ఊపునిచ్చేందుకు చేయగలిగినదంతా చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ విషయంలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. 2023లో 'నారీశక్తి వందన్ అధినియం'ఆమోదానికి దారితీసిన పరిణామం ఇదేనని వివరించారు. వచ్చే ఎన్నికల్లో చట్టం అమలుకు వీలుగా రాజ్యాంగ సవరణ తీసుకొస్తున్నట్లు తెలిపారు. మహిళల ఇప్పటికే బహుళ రంగాల్లో రాణిస్తున్నారని, చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు.

2లో

# లోక్‌సభ సీట్ల పెంపులో ఈ విధానాన్నే అనుసరించాలి



- దామాషా ప్రకారం సీట్లు పెంచితే దక్షిణాదికి తీవ్ర అన్యాయం
- దానివల్ల జనాభా విస్ఫోటనం ఉన్న ఉత్తరాదిమధ్యభారత రాష్ట్రాలకే లాభం
- అందుకే 50% జనాభా లెక్కన, మరో 50% ఆర్థికాభివృద్ధి ప్రకారం సీట్లు పెంచాలి
- ఈ అంశంపై చర్చలు, ఏకాభిప్రాయ సాధనకు అఖిలపక్ష భేటీ నిర్వహించాలి
- ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్: 'ప్రొరాటా (దామాషా) పద్ధతిలో లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుంచి 850కి పెంచితే జనాభా నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతుంది. కేంద్ర నిధుల కేటాయింపుల్లో ఇప్పటికే వివక్షకు గురవుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇది మరో ఎదురుదెబ్బ అవుతుంది. దేశ ఆర్థిక వికాసానికి గణనీయంగా సహకారం అందించే దక్షిణాదికి ప్రాధాన్యం, ప్రాతినిధ్యం పార్లమెంటులో తగ్గిపోతుంది. జనాభా విస్ఫోటనం ఉన్న ఉత్తరాదిమధ్యభారత రాష్ట్రాలు లాభపడతాయి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రొరాటాకు బదులు హైబ్రిడ్ మోడల్‌లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ విషయంలో దక్షిణాదికి అన్యాయం జరగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చల కోసం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధనతోనే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 131వ

- మిగతా 2వ పేజీలో



## వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీని తిప్పికొట్టాలి

- టీడీపీ క్యాడర్‌కు నారా లోకేశ్ దిశానిర్దేశం
- క్లస్టర్ ఇన్‌చార్జులతో నారా లోకేశ్ 'కాఫీ కబుర్లు'
- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు
- ఎన్టీఆర్, చంద్రబాబు ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- నా రెడ్ బుక్ సమాజం కోసమైతే, జగన్ రాజారెడ్డి రాజ్యాంగం విధ్వంసం కోసమని విమర్శలు

2లో



## ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని

- మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని సూచన
- ఉపాధి హామీ కార్మికులు జాగ్రత్తలు పాటించాలన్న సీతక్క



## లోక్‌సభ స్థానాలు 850కి పెంపు!

- తుది సంఖ్యపై డీలిమిటేషన్ కమిషన్‌దే నిర్ణయం
- రాష్ట్రాలకు గరిష్టంగా 815, యూటీలకు 35
- వాటిలో 280 దాకా మహిళలకు కేటాయింపు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు 3 బిల్లులు
- రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

2లో

# క్వాంటం రంగంలో ఏపీ పయనీర్...

- టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన సీఎం చంద్రబాబు
- అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ప్రారంభం
- క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్‌ప్యాడ్‌గా మారుస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏఐ, క్వాంటం నైపుణ్యాల్లో 45 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని ప్రణాళిక
- డిసెంబరు నుంచి అమరావతి క్వాంటం వ్యాలీని ప్రారంభించనున్నట్టు వెల్లడి
- స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం టెస్ట్‌బెడ్‌లను అభివృద్ధి చేసినట్టు తెలిపిన ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది. ప్రపంచ క్వాంటం దినోత్సవం, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను రాష్ట్రంలో ఆవిష్కరించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో '1ఎస్', గన్నవరంలోని మేధా టవర్స్‌లో '1క్యూ' పేరిట ఏర్పాటు చేసిన క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జాతికి అంకితం చేశారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్, క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించి, ధ్రువీకరించే సామర్థ్యం కలిగిన తొలి రాష్ట్రంగా అవతరించింది.

- మిగతా 2వ పేజీలో

## వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీని తిప్పికొట్టాలి

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, సిద్ధాంతపరమైన పునాదులే నాయకత్వానికి అసలైన బలమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఎన్టీఆర్, తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటిన చంద్రబాబు బలమైన సిద్ధాంతాలతోనే విజయాలు సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గత వైసీపీ పాలనలో జరిగిన దమనకాండను లోకేశ్ గుర్తుచేశారు. "దేవాలయంలాంటి టీడీపీ కార్యాలయంపై, చంద్రబాబు గారి ఇంటిపై దాడులు చేశారు. అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్య వంటి వారిని వెంటాడి చంపారు. డాక్టర్ సుధాకర్, కోడెల శివప్రసాద్, చిన్నారి మిస్బా మరణానికి కారణమయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం, దాడులు, హత్యలు, అవినీతితో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్, ఇప్పుడు అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వంపై విష ప్రచారానికి దిగుతున్నారు. వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే అసత్యాలను ఐక్యంగా తిప్పికొట్టాలి. నా రెడ్ బుక్ సమాజ హితం కోసమైతే, రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ సమాజాన్ని నాశనం చేయాలనుకున్నారు. ఏ ఆత్మ చెప్పిందో కానీ, 'మావిగన్' అంటూ కలవరిస్తున్నారు" అని లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, వాటి వెనుక ఉన్న పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించడం అత్యంత కీలకమని లోకేశ్ స్పష్టం చేశారు. "కార్యకర్తల మధ్య ఐక్యత, క్రమశిక్షణ పార్టీని మరింత బలోపేతం చేస్తాయి. సిద్ధాంతాలపై ఆధారపడి ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటేనే దీర్ఘకాలిక రాజకీయ విజయాలు సాధ్యమవుతాయి. ఎన్ని పనులున్నా ముఖ్యమంత్రి గారు, నేను ప్రతి వారం పార్టీ కార్యాలయంలో గడుపుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నాం. అదేవిధంగా ప్రతి కార్యకర్త కూడా పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలి. పార్టీ రూపొందించిన ఆరు ముఖ్య సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలి" అని ఆయన వివరించారు.

## ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ప్రజలకు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, కాబట్టి ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 11 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని సూచించారు. సాధ్యమైనంత వరకు పనులను ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పూర్తి చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం సమయంలో ఇంటివద్ద ఉండటం మంచిదని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తలకు టోపీ లేదా తలపాగా పెట్టుకోవాలని, శరీరాన్ని ఎండ నుంచి రక్షించుకోవాలని సూచించారు. జాగ్రత్తలు పాటించాలని లేదంటే వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ చలివేంద్రాలను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించామని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు మంత్రి సీతక్క సూచనలు చేశారు. వేసవి కాలంలో పనులు జరుగుతున్నందున కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తలపాగా ధరించడం, సమీపంలోనే తాగునీరు ఉంచుకోవడం చేయాలని అన్నారు. పని స్థలాల్లో మంచినీటి సదుపాయం తప్పనిసరి అని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మీ ఆరోగ్యం మీకే కాదు, ప్రభుత్వానికి కూడా ముఖ్యమే అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకుని పనిచేయాలని అన్నారు.

## క్వాంటం రంగంలో ఏపీ పయనీర్...

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, క్వాంటం సైన్స్ వందేళ్లు పూర్తి చేసుకున్న వేళ, ప్రపంచ క్వాంటం దినోత్సవాన ఈ ఫెసిలిటీలను ప్రారంభించుకోవడం ద్వారా చరిత్ర సృష్టించామని అన్నారు. "విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతి నాడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేధా టవర్స్‌లో 1క్యూ క్వాంటం సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. ఈ టెస్ట్‌బెడ్‌లను పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నాం" అని తెలిపారు. భారత తొలి ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలకు, అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాందికర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "పారిశ్రామిక రంగానికి విద్యుత్ ఎంత కీలకమో, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ అంతే ముఖ్యం. ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ అంతకన్నా ప్రధానం" అని చంద్రబాబు నొక్కి చెప్పారు. భవిష్యత్తును శాసించే శక్తి క్వాంటం సాంకేతికతలోనే ఉందని, అందుకే అమరావతిని క్వాంటం టెక్నాలజీకి లాంచ్‌ప్యాడ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. ఐటీ రంగంలో తెలుగువారు పోషించిన కీలక పాత్రను గుర్తుచేస్తూ, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి కూడా ఆంధ్రప్రదేశ్ వేదికగా మారడం గర్వకారణమని అన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని 'అమరావతి 1ఎస్' కంప్యూటర్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని 'అమరావతి 1క్యూ' కంప్యూటర్ పారిశ్రామిక వినియోగానికి ఎంతగానో తోడ్పడతాయని వివరించారు. కేవలం 8 నెలల్లోనే ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. "పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని నేను సూచించాను. దాని ఫలితంగానే ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పూణెలోని డీఆర్డీఓ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ టెస్ట్‌బెడ్‌లు సిద్ధమయ్యాయి. వ్యూహాత్మక టెక్నాలజీల్లో ఇకపై భారత్ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయడం 'ఆత్మనిర్భర్' కార్యక్రమంలో కీలకమైన అంశం" అని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించిన 10 సూత్రాల్లో డీప్ టెక్ ఒక కీలకమైన అంశమని ఆయన గుర్తుచేశారు.

# లోక్‌సభ సీట్ల పెంపులో ఈ విధానాన్నే అనుసరించాలి

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. 'లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం పూర్తిగా విశ్లేషించలేదు. తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ దశాబ్దాలుగా జనాభా నియంత్రణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయి. జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాయి. ప్రొరాటా పద్ధతిలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలనే ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోయి రాజకీయంగా బలహీనపడతాయి. ప్రొరాటా మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా రాజకీయ అసమతుల్యతకు దారితీస్తుంది. ప్రొరాటా మోడల్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు. ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నమవుతుంది. అందుకే అందరికీ న్యాయం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరం. ఈ విషయంలో హైబ్రిడ్ మోడల్ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుంది. అందరి ప్రాతినిధ్యంతోపాటు అన్ని రాష్ట్రాల సహకారాన్ని ఈ మోడల్ సమతౌల్యం చేస్తుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సూచించిన 50 శాతం 50 శాతం విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. హైబ్రిడ్ మోడల్ ప్రకారం కొత్తగా పెంచే సీట్లలో సగాన్ని ప్రొరాటా పద్ధతిలో... మిగతా సగం సీట్లను రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం (జీఎస్‌డీపీ), అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఏఐసీసీ సంపూర్ణ మద్దతిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా వెంటనే అమలు చేయాలని ప్రధాని మోదీని సీఎం కోరారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి గతంలో సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మారుస్తూ డీలిమిటేషన్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని.. అందుకు పూర్తి మద్దతు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. హైబ్రిడ్ మోడల్‌పై ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతోపాటు ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సూత్రం అమలవుతుందన్నారు. ఈ అంశంపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపి అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. దేశ బలం భిన్నత్వంలో ఏకత్వమని.. ఇలాంటి కీలక నిర్ణయాలు ఆ ఐక్యతను చాటేలా ఉండాలని సూచించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అందరికీ న్యాయం చేసే పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



### దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు రేవంత్ లేఖ

లోక్‌సభ సీట్లను ప్రొరాటా పద్ధతిలో పెంచే ప్రతిపాదనను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, ఏపీ సీఎం చంద్రబాబు, కేరళ సీఎం పినరయి విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామిలకు వేర్వేరుగా బహిరంగ లేఖలు రాశారు.

## మహిళా రిజర్వేషన్లతో చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

'నారీశక్తి వందన్ అధినియం'సవరణను ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో తప్పనిసరిగా ఆమోదించాలని ప్రధాని మోదీ వెల్లడించారు. ఏమాత్రం ఆలస్యం జరిగినా మహిళలకు అన్యాయం చేసినట్లే అవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడం కోసం దేశంలోని మహిళలంతా ఎదురు చూస్తున్నారని తాను కచ్చితంగా నమ్ముతున్నట్లు తెలిపారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని సాధ్యమైనంత త్వరగా పెంచడం చాలా ముఖ్యమని, అందుకోసం అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కుల కోసం ఆడబిడ్డలను ఇంకా వేచి ఉండేలా చేయలేమని తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలో మహిళల గళం బలపడినప్పుడు ప్రజాస్వామ్య గళం కూడా బలపడుతుందన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నామని మోదీ స్పష్టంచేశారు. స్థానిక ఎంపీలకు లేఖలు రాసి, చరిత్రాత్మక ప్రత్యేక సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొనేలా ప్రోత్సహించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. శతాబ్దాల పాటు పెనుప్రభావం చూపే గొప్ప పని చేయబోతున్నారంటూ ఎంపీలకు గుర్తు చేయాలని కోరారు. ఇది కచ్చితంగా వారిలో స్ఫూర్తిని నింపుతుందని ప్రధాని మోదీ వెల్లడించారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఆశించిన ఫలితం ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం నారీశక్తి వందన్ అధినియం పట్ల మహిళల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోందని పేర్కొన్నారు.

## ఆ నౌకలనే అడ్డుకుంటున్నాం: అమెరికా సెంట్ కామ్ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ జలాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ ఓడరేవులను పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించింది. అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని అన్ని ఇరాన్ పోర్టుల నుంచి ఏ నౌక బయటకు వెళ్లకుండా, లోపలికి రాకుండా కఠినమైన ఆంక్షలు విధించింది. ఈ భారీ సైనిక ఆపరేషన్ కోసం 10,000 మందికి పైగా అమెరికా నావికులు, మెరైన్లు, వైమానిక దళ సిబ్బందిని రంగంలోకి దించింది. ఈ మిషన్ కోసం డజనుకు పైగా యుద్ధనౌకలు, వందకు పైగా యుద్ధ, నిఘా విమానాలను మోహరించింది. దిగ్బంధనం ప్రారంభమైన తొలి 24 గంటల్లోనే దీని ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏ ఒక్క నౌక కూడా ఈ సైనిక వలయాన్ని దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఈ క్రమంలో, అమెరికా బలగాలు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి ఆరు వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి ఇరాన్‌లోని గల్ఫ్ ఆఫ్ ఒమన్ పోర్టులోకి ప్రవేశించాయి. ఈ దిగ్బంధనాన్ని ఏ దేశ నౌకపైనా పక్షపాతం లేకుండా అమలు చేస్తున్నామని, ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా అక్కడి నుంచి బయలుదేరే ఏ నౌకనైనా నిలిపివేస్తామని అమెరికా స్పష్టం చేసింది.

## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.



# లోక్‌సభ స్థానాలు 850కి పెంపు!

న్యూఢిల్లీ: 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని, అందుకోసం లోక్‌సభ స్థానాలను భారీగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో లోక్‌సభలో స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుంచి 850 దాకా పెరిగే అవకాశముంది! వీటిలో అన్ని రాష్ట్రాల్లో కలిపి 815కు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గరిష్టంగా 35కు మించకుండా స్థానాలుంటాయి. మహిళలకు 33 శాతం లెక్కన వాటిలో గరిష్టంగా 280 నుంచి 281 స్థానాల దాకా రిజర్వు చేయనున్నారు. దీనికి వీలు కల్పించేందుకు ఉద్దేశించిన 3 బిల్లులను గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగబోయే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టనుంది. 2029కి ముందే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు, అందుకోసం లోక్‌సభ స్థానాల పెంపుకు వీలు కల్పించేలా రాజ్యాంగ (131వ)సవరణ బిల్లు2026, దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీలుగా డీలిమిటేషన్ బిల్లు2026, ఈ ప్రక్రియను ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరి అసెంబ్లీలకు కూడా వర్తింపజేసేందుకు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు2026 వీటిలో ఉంటాయి. ఈ మూడు బిల్లులకూ ఈ ప్రత్యేక సమావేశాల్లోనే పార్లమెంటు ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. వాటి ముసాయిదా ప్రతులను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంగళవారం ఎంపీలందరికీ పంపింది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కోసం త్వరలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. లోక్‌సభ స్థానాల తుది సంఖ్యను పునర్విభజన కసరత్తు అనంతరం కమిషనే ఖరారు చేయనుంది. ఈ కారణంగానే పెరగనున్న లోక్‌సభ స్థానాల సంఖ్యను రాజ్యాంగ సవరణ బిల్లులో స్పష్టంగా పేర్కొనలేదు. 'అన్ని రాష్ట్రాలకు కలిపి గరిష్ఠంగా 815కు మించకుండా, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35కు మించకుండా లోక్‌సభ స్థానాలుండాలి'అని మాత్రమే తెలిపారు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో స్థానాల సంఖ్యను 50 శాతం పెంచాలని మోదీ సర్కారు నిర్ణయించడం తెలిసిందే. ఇందుకోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటూ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు రాజ్యాంగ సవరణ బిల్లులో వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపుకు వీలుగా రాజ్యాంగంలోని పలు అధికరణలకు సవరణలను కూడా ప్రతిపాదించారు. నారీశక్తి వందన్ అధినియమ్‌గా పేర్కొనే మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణలకు పార్లమెంటు ప్రత్యేక భేటీలో ఆమోదం పొందనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే వెల్లడించడం తెలిసిందే. ఈ ప్రక్రియ ఆలస్యమైతే చట్టసభల్లో విధాన నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆశిస్తున్న మహిళలందరికీ తీవ్ర అన్యాయం జరుగుతుందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2023లో పార్లమెంటు ఆమోదించడం తెలిసిందే. దీని ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం సీట్లను మహిళలకు ప్రత్యేకిస్తారు. అయితే ఈ చట్టం 2034కు ముందు అమల్లోకి వచ్చే పరిస్థితులు లేవు.



# మండిపోతున్న ఎండలు.. దాహార్తిని తీరుస్తున్న 'పీసీఆర్ ఫౌండేషన్'

- జన్నారంలో రెండో వారం కొనసాగిన మజ్జిగ పంపిణీ

**తొలివెలుగు, జన్నారం:** భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండల బారిన పడి దాహంతో అలమటిస్తున్న ప్రజలకు పీసీఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న మజ్జిగ పంపిణీ అందరికీ ఆదర్శనీయంగా నిలుస్తోంది. జన్నారం మండల కేంద్రంలో ఫౌండేషన్ చేపట్టిన ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం వరుసగా రెండో వారం కూడా విజయవంతంగా కొనసాగింది. ప్రతి మంగళవారం జన్నారంలో జరిగే వారసంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. మండుతున్న ఎండల్లో సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు. వేసవి తీవ్రత తగ్గే వరకు ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఫౌండేషన్ చేస్తున్న ఈ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాదగిరి కృష్ణారావు, నోముల రాజ్ కుమార్, మౌలానాతో పాటు పలువురు యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రేపాక పూలదేవికి అశ్రునివాళి

- హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు
- కన్నీటి సంద్రమైన రెడ్లరేపాక గ్రామం



**తొలివెలుగు, వలిగొండ:** మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ప్రముఖ కుటుంబంలో పెద్దమనిషిగా పేరొందిన రేపాక పూలదేవి మంగళవారం ఉదయం కన్నుమూశారు. ఆమె మాజీ జడ్పీటీసీ దివంగత నేత రేపాక రమేశ్ రెడ్డి, ఇందుర్ విద్యాసంస్థల అధినేత రేపాక ప్రదీప్ రెడ్డిల మాతృమూర్తి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పూలదేవి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిచెందిన వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రెడ్లరేపాక గ్రామానికి చేరుకుని పూలదేవి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె కుమారుడు రేపాక ప్రదీప్ రెడ్డి సహా కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాతృవియోగం తీరని లోటని, ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అశ్రునివాళులు అర్పించారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- ఘనంగా 135వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి

**తొలివెలుగు, భువనగిరి:** భారత రాజ్యాంగ నిర్మాత, నవభారత భాస్కరుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొప్పుల వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సమాజంలో సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి దిక్సూచి వంటి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని ప్రశంసించారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ సామాజిక మార్పుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. అంతకుముందు తన కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, జ్యుడీషియల్ విభాగం రిటైర్డ్ అధికారి ఎం. బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# బడుగుల హక్కుల ప్రదాత బాబాసాహెబ్





- ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- దేశ్‌ముఖిలో రక్తదాన శిబిరం.. 60 మంది రక్తదానం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దిక్సూచి అని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న బాబాసాహెబ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు, కుల వివక్ష లేని సమాజ స్థాపన కోసం అంబేద్కర్ నిరంతరం పోరాడారని కొనియాడారు. విద్య ద్వారానే అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆయన చూపిన మార్గంలో యువత నడవాలని పిలుపునిచ్చారు. మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో వినూత్నంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్పంచ్ దుర్గం జంగయ్య విగ్రహానికి నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించగా, సుమారు 60 మంది యువకులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో అంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దల సుధాకర్, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్యా వేణు, దేవరాయకుమార్, సూరపల్లి రాధికా రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భారత లవ కుమార్, వివిధ సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి






- సామాజిక సమానత్వానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- బాబాసాహెబ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, భువనగిరి:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కొనియాడారు. మంగళవారం బాబాసాహెబ్ 135వ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విద్య, సామాజిక చైతన్యం ద్వారానే మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన చిన్నతనంలో ఎన్నో వివక్షలు ఎదుర్కొన్నప్పటికీ విద్యపై పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి బాబాసాహెబ్ అని, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ రేణుక బాబురావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సాహితి, ప్రజా ప్రతినిధులు, ఎస్సీ సంఘ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆధునిక భారత నిర్మాత బాబాసాహెబ్

- వలిగొండలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- హాజరైన సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

**తొలివెలుగు, వలిగొండ:** స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పునాదులపై ఆధునిక భారతదేశాన్ని నిర్మించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కొనియాడారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలో బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. అంబేద్కర్ ఒక వర్గానికి లేదా కులానికి పరిమితమైన వ్యక్తి కాదని, ప్రపంచం గర్వించదగ్గ విశ్వమేధావి అని పేర్కొన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు సామాజిక న్యాయం సాధ్యమవుతోందని వివరించారు. అనంతరం ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్, బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, బీఆర్ఎస్ నాయకులు సురకంటి వెంకటరెడ్డి, నిరంజన్ రెడ్డి, గాజుల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకు శివయ్య, చిలుకూరి సత్తిరెడ్డి, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు మారగోని శ్రీనివాస్, ఎల్లంకి మహేష్, సర్పంచ్ బోడిగే లింగస్వామి, సుక్క శ్రీకాంత్, బ్రహ్మం కూర శ్రీనివాస్, కొండూరు నీలమ్మ, మచ్చ రాణి, బూడిద మణెమ్మ, రామలింగం, కొండూరు సత్తయ్య, పుష్ప, మెరుగు వెంకటేశం, మస్కు నరసింహ, రామచంద్రు, దుబ్బ లింగం తదితరులు హాజరై అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.




# చెరువులో గల్లంతైన యువకుడు మృతి

- రెండో రోజు లభ్యమైన శివగౌడ్ మృతదేహం
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని గోస్కొండ గ్రామ చెరువులో సోమవారం జరిగిన నాటు పడవ ప్రమాదంలో గల్లంతైన యువకుడు పాండాల శివగౌడ్ (24) మంగళవారం శవమై కనిపించాడు. సోమవారం ప్రమాదం జరిగినప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రత్యేక రెస్క్యూ టీంను రంగంలోకి దించి చెరువులో గాలింపును ముమ్మరం చేశారు. సుమారు పదిన్నర గంటల సమయంలో శివ మృతదేహం నీటిపై తేలడంతో సహాయక బృందాలు బయటకు తీశాయి. చేతికి అందివచ్చిన కొడుకు విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లి మనోరమ, కుటుంబ సభ్యులు అల్లాడిపోతున్నారు. ఎస్ఐ భాస్కర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మనోరమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. యువకుడి మరణంతో గోస్కొండ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## రామన్నపేటలో బాబాసాహెబ్ జయంతి వేడుకలు

- ఘనంగా భారీ రోడ్ షో
- నివాళులర్పించిన అంబేద్కర్ మండల కమిటీ కన్వీనర్ బొడ్డు సాలయ్య

**తొలివెలుగు, రామన్నపేట:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు రామన్నపేట మండల కేంద్రంలో మంగళవారం మిన్నంటాయి. మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా పట్టణ పురవీధుల్లో భారీ రోడ్ షో నిర్వహించారు. నీలి జెండాలతో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో రామన్నపేట ప్రధాన కూడలి నీలిమయమైంది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మండల కమిటీ కన్వీనర్ బొడ్డు సాలయ్య, కో-కన్వీనర్ నాగటి ఉపేందర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, ఆధునిక భారత శిల్పిగా అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లనే నేడు ప్రతి పౌరుడికి సమాన హక్కులు లభిస్తున్నాయని పేర్కొన్నారు. మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అంబేద్కర్ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబాసాహెబ్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన సర్పంచ్, గ్రామస్తులు, మహనీయుని మార్గంలో నడవాలని ప్రతిజ్ఞ



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని పల్లివాడ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమానత్వం, న్యాయం, విద్య ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. బాబాసాహెబ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన బాధ్యత ఉందని, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలందరూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కంకణాల లక్ష్మారెడ్డి, గడ్డం యాదగిరి, దండిగా బిక్షమయ్య, దండిగా పాండు, కంబాలపల్లి మధు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు.

## బాబాసాహెబ్ ఆశయ సాధనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- రామన్నపేటలో ఘనంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి

**తొలివెలుగు, రామన్నపేట:** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను రామన్నపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన విశేష సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నకిరేగంటి మొగులయ్య, మండల ఇన్‌ఛార్జి కొరివి శంకర్ హాజరై ప్రసంగించారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన అసమానతలను పారద్రోలి, సకల జనులకు సమన్యాయం చేకూర్చాలన్న బాబాసాహెబ్ ఆశయాలను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిజం చేస్తోందని వారు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 'సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్ – సబ్ కా విశ్వాస్' అనే ఉన్నతమైన స్ఫూర్తితో దేశ ప్రగతి కోసం ముందుకు సాగుతోందని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సామాజిక సాధికారత దిశగా మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రక అడుగులే, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ఆ మహనీయునికి మనం అర్పించే నిజమైన నివాళి అని వారు ఉద్ఘాటించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జాతి నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు కట్ట యాదయ్య, గోపవరం ధర్మరాజు, మద్దెలపూరి ఐలయ్య, జిల్లా లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శులు బెజ్జంకి శివకుమార్, జంగిలి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజని, బట్టి రమేష్, కార్యదర్శులు బతక్క నరేష్, బందెల సంజీవ, రేపాక లింగస్వామి, పార్టీ నాయకులు వావిళ్ళ సంతోష్, ఐలాపురం అశోక్, మచ్చ మహేష్, బోయపల్లి ప్రవీణ్, బతక్క సైదులు, వీరమల్ల గణేష్, సుర్వి మల్లేష్, బొడ్డుపల్లి సైదులు, సిల్వేరు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



# హిందూ సమాజం సంఘటితం కావాలి






- సనాతన ధర్మంతోనే దేశాభివృద్ధి సాధ్యం
- శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామీజీ పిలుపు
- పోచంపల్లిలో వైభవంగా హిందూ సమ్మేళనం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భారతదేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలబెట్టాలంటే హిందూ సమాజం సంఘటితం కావాలని త్రిలింగ ప్రాంత సేవ పత్రి పూజ శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామీజీ ఉద్బోధించారు. మంగళవారం పురపాలక కేంద్రంలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో 'హిందూ సమ్మేళనం' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కండేయ స్వామి ఆలయం నుంచి బాలాజీ ఫంక్షన్ హాల్ వరకు కాషాయ జెండాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని పాటించడం ద్వారానే మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడతాయని, అది దేశాభివృద్ధికి సూచికగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతి హిందువు ధర్మ పరిరక్షణలో బాధ్యతగా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో భాగంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్, రాష్ట్ర సేవిక సమితి జిల్లా కార్యవాహ కటకం పావని, డాక్టర్ దేవరాయ స్వామి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మహాజన సంఘ అధ్యక్షులు సీత శ్రీరాములు, హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కొమ్ము



లక్ష్మణ్, కోశాధికారి సాయిని భాస్కర్, ఉపాధ్యక్షులు సింగనబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఘనంగా టీఎస్ యూటీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవం
- రామన్నపేటలో పతాకావిష్కరణ, నివాళులు

**తొలివెలుగు, రామన్నపేట:** ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) 13వ ఆవిర్భావ దినోత్సవం, అలాగే మహనీయుల జయంతి ఉత్సవాలు రామన్నపేటలో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) ఆవరణలో మంగళవారం యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.స్వామి ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరో జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్ మాట్లాడుతూ.. దళిత,



బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతి కోసం మహనీయులు చేసిన సేవలను కొనియాడారు. స్త్రీ విద్య, సామాజిక చైతన్యం, సమానత్వం కొరకు తమ జీవితాలనే త్యాగం చేసిన గొప్ప వ్యక్తులు పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ అని కీర్తించారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి పోరాడుతున్న యూటీఎఫ్ సంఘం 13 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉపాధ్యాయ లోకానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరు అనిల్ కుమార్, రామన్నపేట మండల కమిటీ అధ్యక్షుడు నీలం శేఖర్, ప్రధాన కార్యదర్శి మంకాల కుమారస్వామి, కోశాధికారి కర్నె త్రివేణి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఘాసిరాం, ఎఫ్‌డబ్ల్యూఎస్ మండల కన్వీనర్ మేడి మధుబాబు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు సిహెచ్ మట్టారెడ్డి, జగదీశ్వరా చారి, వెంకటయ్య, జహంగీర్, కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజు, మండల నాయకులు ఉదయ్, ఎంఆర్‌సీ సిబ్బంది శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబాసాహెబ్ జయంతి



**తొలివెలుగు , రాజాపేట:** రాజాపేట మండలం నర్సాపురం గ్రామంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్మ శిరీష నాగరాజు, విగ్రహ దాత దుబ్బాసి సుదర్శన్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు దుబ్బాసి శ్రీను తదితరులు పాల్గొని ప్రసంగించారు. అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారపాక కరుణాకర్, అంబేద్కర్ యూత్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**తొలివెలుగు, మోటకొండూర్:** తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆలేరు యూనిట్ కార్యవర్గ సమావేశం మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. చింతకింది మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా నేతలు ముఖ్య అతిథులుగా హాజరై విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ డి.ఏలు, పి.ఆర్.సి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం నగదు రహిత వైద్య సేవలు అందించేలా హెల్త్‌కార్డుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏళ్ల తరబడి సేవలు అందించి పదవీ విరమణ పొందిన తమ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భువనగిరి సత్యనారాయణ, కోశాధికారి భీష్మమ్ రెడ్డి మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి సభ్యులందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం విజయవంతానికి సహకరించిన కొంతం అంజిరెడ్డికి సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు యూనిట్ ప్రధాన కార్యదర్శి పరిగెల రాములు, సహాయక అధ్యక్షులు బల్ల దామోదర్, కోశాధికారి వంగపల్లి మల్లేశం, సెక్రెటరీ తోట మల్లయ్య, సలహాదారులు విశ్వపట్ల బాల్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్ పటేల్ సుధాకర్ రెడ్డి, మంద సోమరాజు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆపన్న హస్తం.. పద్మశాలి సంఘం భరోసా

- బాధిత కుటుంబానికి రూ. 20,500 ఆర్థిక సాయం

**తొలివెలుగు, రాజాపేట:** ఆపదలో ఉన్న స్వకులస్తుల కుటుంబాన్ని ఆదుకునేందుకు రాజాపేట పద్మశాలి సంఘం ముందుకొచ్చింది. మండల కేంద్రానికి చెందిన దూస దేవేంద్ర ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గమనించిన శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం మంగళవారం బాధితులకు ఆర్థిక భరోసానిచ్చింది. సంఘం తరపున రూ. 5,000 ప్రత్యేక నిధిని కేటాయించగా, కులస్తులందరూ వ్యక్తిగతంగా స్పందించి మరో రూ. 15,500 పోగు చేశారు. మొత్తం రూ. 20,500 నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు సంఘం ఉపాధ్యక్షులు ఆడెపు రాజు, బిర్రు బాలకిషన్‌ల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం సంఘం బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ చుంచు నారాయణ, సహాయ కార్యదర్శులు బల్ల కృష్ణ, గర్దాసు శ్రీశైలం, సకినాల శ్రీనివాసులు, కుడికాల నరేందర్, కొంక భాస్కర్, అలక ఈశ్వర్, పెంట సత్యనారాయణ, మెరుగు ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై సామూహిక ప్రతిజ్ఞ

- ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**తొలివెలుగు, రాజాపేట:** ప్రయాణాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలని రాజాపేట ఎస్ఐ వై. లింగారెడ్డి సూచించారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని, గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాల సాక్షిగా ఈ ప్రతిజ్ఞ చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, నిబంధనలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.



## ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

- రాజాపేట మండలంలో నూరు శాతం హాజరు నమోదు
- హర్షం వ్యక్తం చేసిన విద్యాశాఖ అధికారులు

**తొలివెలుగు, రాజాపేట:** గత నెల రోజులుగా సాగిన పదో తరగతి (ఎస్సెస్సీ) వార్షిక పరీక్షలు ముగిశాయి. రాజాపేట మండలంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులందరూ హాజరు కావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో నూరు శాతం హాజరు నమోదైంది. పరీక్షల తొలిరోజు తహసీల్దార్ వల్లపు ప్రదీప్, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధి శరత్ యామిని బృందాలు వేర్వేరుగా కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం శ్రీ రాజాపేట కేంద్రంలో 188 మంది, రాజాపేట బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 152 మంది, రఘునాథపూర్ కేంద్రంలో 93 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈఓ చందా రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో పరీక్షలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్లు తడ్క రాజు, కె. మనోజ్ కుమార్, జే. ప్రభాకర్, డిపార్ట్‌మెంట్ అధికారులు బి. వసంత, ఎస్. విజయలక్ష్మి, బి. పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోసేవ గర్వకారణం: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- చల్లూరు ధ్యాన్ ఫౌండేషన్ గోశాల సందర్శన



**తొలివెలుగు, రాజాపేట:** మూగజీవుల సంరక్షణకు ధ్యాన్ ఫౌండేషన్ నిర్వాహకులు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కొనియాడారు. మంగళవారం మండల పరిధిలోని చల్లూరు వద్ద గల ధ్యాన్ ఫౌండేషన్ గోశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోశాల నిర్వహణ తీరును, గోవుల సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గోశాల ఆవరణలో సిసి రోడ్ల నిర్మాణం, నిరంతర నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని నిర్వాహకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, గోశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని, త్వరలోనే అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు బీర్ల ఐలయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమగాని రూప బాల నరసయ్య గౌడ్, ఉప సర్పంచ్ బొంత సుధాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవు

**తొలివెలుగు, రాజాపేట:** ఆలేరు నియోజకవర్గంలో ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరిగితే అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశించారు. మంగళవారం రాజాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 322లో ఉన్న క్రషర్‌తో తనకు సంబంధం ఉందంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు.

**ఆధారాలు ఉంటే నిరూపించండి:**

నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల ఆదరణ పొందుతున్న తరుణంలో, రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లోనే మైనింగ్ జరుగుతోందన్న ఆరోపణల్లో నిజం లేదని, దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడితే సహించేది లేదని, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ అక్రమ కార్యకలాపాలు సాగుతున్నా మైనింగ్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సూచించారు.



# జలకళతో పరవళ్లు తొక్కుతున్న నల్లచెరువు





- గోదావరి నీళ్లతో నిండిన చెరువుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణానికి ప్రధాన జలాధారమైన నల్లచెరువు గోదావరి జలాలతో నిండి జలకళను సంతరించుకుంది. చెరువు నిండి అలుగు పోస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గంగామాతకు నమస్కరించి, చెరువు నీటిలో పూలు, పండ్లు సమర్పించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోదావరి జలాలతో నల్లచెరువు నిండటం వల్ల యాదగిరిగుట్ట పట్టణ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. చెరువు అలుగు పోయడం వల్ల పట్టణంలోని ప్రధాన మురికి కాలువలో నిలిచిపోయిన వ్యర్థాలన్నీ కొట్టుకుపోయి, కాలువ పూర్తిగా ప్రక్షాళన అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలో స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడటమే కాకుండా, మురుగు నీటి సమస్య తొలగి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదాద్రీశుడి పాదాల చెంత ఉన్న ఈ చెరువు నిండటం భక్తులకు, స్థానికులకు శుభసూచకమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ప్రైవేట్ ఉద్యోగికి టోకరా



మ్యాజిక్ బ్రిక్స్‌లో రెస్టారెంట్స్ రివ్యూస్ రాసేందుకు పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించిన సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేట్ ఉద్యోగికి రూ.6.4 లక్షలు బురిడీ కొట్టించారు. అల్వాల్‌కు చెందిన బాధితుడికి టెలిగ్రామ్ యాప్‌లో ఒక మెసేజ్ వచ్చింది. మెసేజ్ పంపించిన యువతి తాను మ్యాజిక్ బ్రిక్స్‌లో రిక్రూట్‌మెంట్ మేనేజర్‌నని పరిచయం చేసుకుంది. తమ వెబ్‌సైట్‌లో రెస్టారెంట్స్ రివ్యూస్ రాయాలని, 5 స్టార్ రేటింగ్ ఇవ్వాలని ఆ టాస్క్‌లు పూర్తి చేస్తే రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు మీకు ఆదాయం వస్తుందని నమ్మించింది. దీంతో బాధితుడు యువతి సూచించిన వెబ్‌సైట్‌లో అకౌంట్ క్రియేట్ చేసుకున్నాడు. డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే మరిన్ని లాభాలొస్తాయని నమ్మించడంతో బాధితుడు మొదట కొంత డబ్బు వెచ్చించడంతో కొంత తిరిగి చెల్లించారు. దాంతో దఫ దఫాలుగా రూ.6.7 లక్షలు పెట్టుబడి పెట్టాడు, అయితే స్క్రీన్‌పై రూ.13.67 లక్షలు కన్పిస్తుండడంతో వాటిని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నిస్తే అది నిరాకరించడంతో మోసాన్ని గుర్తించి మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# నగరంలో జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు

రెండునెలల పాటు క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఐపీఎల్ మరో సీజన్ కొనసాగుతోంది. మార్చి 28న ప్రారంభమైన ఈ మెగా లీగ్ మే 31వరకు జరగనుంది. క్రికెట్ ఆటగాళ్ల విన్యాసాలను చూసేందుకు అభిమానులు ఆశగా ఎదురుచూస్తుంటే మ్యాచ్‌ల గెలుపు ఓటములు, ఆటగాళ్ల ప్రదర్శనపై రూ.లక్షలు బెట్టింగుల పేరుతో చేతులు మారుతున్నాయి. బరిలో బంతాట సాగుతుంటే బయట బుకీల దొంగాట సాగుతున్నదని ఓ పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. బెట్టింగ్ దందాకు చెక్ పెట్టడానికి నగర పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా బెట్టింగ్‌ను మాత్రం అరికట్టలేకపోతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈసారి కొత్తగా ప్రిడిక్షన్స్ పేరిట ఆన్‌లైన్‌లో గెలుపు ఓటములు చెబుతూ సైబర్ క్రైమ్ చేస్తున్న ముఠాల ఆగడాలు పెరిగిపోయాయని పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటి ప్రమోషన్ల విషయంలో గత నెలరోజుల్లో 494 పెయిడ్ ప్రకటనలను, ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లను బ్లాక్ చేయించారు.

**దుబాయ్ ప్రధాన కేంద్రంగా బెట్టింగులు**

ఐపీఎల్ సీజన్ మొదలుకాగానే నగరంలో రూ.లక్షల బెట్టింగులు నడుస్తున్నాయి. ప్రధానంగా క్రికెట్ అభిమానులు, యువత బెట్టింగులో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం ఒక గ్రూపుగా ఏర్పడి లక్షల్లో బెట్టింగులు పెడుతున్నారు. ముఖ్యంగా ఐపీఎల్ 2026 సీజన్‌ను క్యాష్ చేసుకునేందుకు దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ నెట్‌వర్క్ నడుస్తున్నదని పోలీసులు చెప్పారు. అక్కడి నుంచి సాఫ్ట్‌వేర్ లింకులు, వెబ్‌సైట్ అడ్మిన్ ఐడీలను స్థానిక బుకీలకు అమ్ముతుండగా నగరంలోని బుకీలు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా రహస్య గ్రూపులు ఏర్పాటు చేసి పందేలు కాస్తున్నారు.

**ఐపీఎల్ ప్రిడక్షన్ పేరిట ఆన్‌లైన్ ఉచ్చు..**

ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియలో కొందరు మోసపూరిత ప్రకటనలతో విరుచుకుపడుతున్నారని వారి మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దంటూ హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఒక ప్రకటనలో యువతను హెచ్చరించారు. టాస్ ఎవరిది, మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుందో ముందే చెబుతామంటూ తమ చానెల్స్‌లో సబ్‌స్క్రైయిబ్ చేయించుకుని, నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారని, ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రమోషన్ల విషయంలో పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని బెట్టింగ్ నిర్వాహకులను హెచ్చరించారు.

# గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



**798 గ్రాముల గంజాయి స్వాధీనం**

పటాన్‌చెరు టౌన్, ఏప్రిల్ 14 :గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పటాన్‌చెరు పోలీసులు పట్టుకొని అతని నుంచి 798 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎన్.రాజు తెలిపిన వివరాల ప్రకారండ బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా భగవత్‌పూర్‌కు చెందిన సురేశ్ రాయ్ కొంతకాలంగా ఇంద్రేశం మున్సిపాలిటీ రామేశ్వరం బండలోని డైరీ ఫామ్‌లో పని చేస్తున్నాడు. మూడు నెలలుగా ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా అటవీ ప్రాంతం నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి పటాన్‌చెరు ప్రాంతంలో వ్యసనపరులకు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కిలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి ఈనెల 13న ఆర్టీసీ బస్సులో పటాన్‌చెరుకు సురేశ్‌రాయ్ వచ్చి 200 గ్రాముల గంజాయిని అమ్మి రామేశ్వర్‌బండలోని డైరీ ఫామ్‌కు వెళ్లాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ రాజు పోలీసు సిబ్బందితో కలిసి అతన్ని పట్టుకొని విచారించగా 798 గ్రాముల గంజాయి లభించింది. గంజాయి, మొబైల్‌ను సీజ్ చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎన్ రాజు తెలిపారు.

# అమ్మ నగలతో.. బూట్లు కొని

సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ద్వారా ఇద్దరు మేలిమి ముత్యాల్లాంటి బౌలర్లు ఈ ప్రపంచానికి పరిచయమయ్యారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన ఆ ఇద్దరు క్రికెటర్లు దేశ దృష్టిని తమ వైపునకు తిప్పుకున్నారు. ఆడుతున్నది తొలి మ్యాచ్ అయినా ఎలాంటి తొణుకు బెణుకు లేకుండా వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకుంటూ ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్ సత్తాచాటారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ ప్రచండ పేస్‌తో వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, ప్రిటోరియస్ డకౌట్లుగా పెవిలియన్ పంపి కొత్త చరిత్ర లిఖించాడు. అయితే మరోవైపు హింగేకు పోటీగా సకీబ్ హుస్సేన్..రాజస్థాన్‌పై వికెట్ల వేటలో అదరగొట్టాడు. హింగే టాపార్డర్ పనిపడితే..సకీబ్ తన పేస్ వైవిధ్యంతో మిడిలార్డర్‌తో పాటు లోయార్డర్ పనిపట్టాడు. సకీబ్ క్రికెట్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకమని చెప్పాలి. బీహార్‌లోని గోపాల్‌గంజ్ ప్రాంతానికి చెందిన సకీబ్‌ది పేద కుటుంబం. తండ్రి అలీ అహ్మద్ హుస్సేన్ వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించేవారు. అయితే కాలి గాయం కారణంగా వ్యవసాయం భారంగామారడంతో సకీబ్ ఆ బాధ్యతను భుజానేసుకునే ప్రయత్నం చేశాడు. ఆర్మీలో చేరేందుకు గ్రామంలోని మైదానంలో రోజు ఉదయం ప్రాక్టీస్ చేసిన సకీబ్ క్రికెట్‌లోకి అనూహ్యంగా ప్రవేశించాడు. సకీబ్ ఫిట్‌నెస్‌ను పరిశీలించిన కోచ్‌లు క్రికెట్‌ను ఎంచుకొమ్మన్నారు. మొదట్లో స్థానిక టోర్నీల్లో టెన్నిస్ బాల్‌తో తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన సకీబ్‌డమ్యాచ్‌కు ఇంత చొప్పున ఆదాయాన్ని ఆర్జించేవాడు. కుటుంబ పోషణకు ఈ యువ క్రికెటర్ ఇతోధికంగా సాయం చేసేవాడు. అయితే అప్పటికే పేదరికంలో ఉన్న సకీబ్ స్పైక్ షూస్ కొనేందుకు స్థోమత లేక తన మనుసులో మాటను తల్లి సుబుక్తారా ఖాతూన్ దగ్గర వెలిబుచ్చాడు. కొడుకు కోరికను కాదనలేని తల్లి తన నగలు అమ్మి వచ్చిన డబ్బుతో బూట్లు కొనిచ్చింది.

తన తల్లి త్యాగాన్ని మనుసులో పెట్టుకుని 17 ఏండ్ల ప్రాయంలో తొలిసారి రాష్ట్ర జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అరంగేట్రం చేసిన ఈ యువ పేసర్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. అప్పటి వరకు టెన్నిస్ బంతితో ఆడిన సకీబ్ తొలిసారి లెదర్ బంతితో ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు. అరంగేట్రం మ్యాచ్‌లో ఆకట్టుకోలేకపోయిన సకీబ్ గుజరాత్‌తో పోరులో నాలుగు వికెట్లతో సత్తాచాటాడు. అతని ప్రదర్శన ఆధారంగా చెన్నై నెట్‌బౌలర్‌గా సకీబ్‌ను తీసుకుంది. గత సీజన్ ముస్తాక్ అలీ టోర్నీలో 29.6 సగటుతో ఐదు వికెట్లు తీసిన ఈ యువ పేసర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ 2024లో జట్టులోకి తీసుకున్నా బెంచ్‌కే పరిమితం చేసింది. ఈ ఏడాది జరిగిన వేలంలో కనీస ధర రూ.30 లక్షలకు తీసుకున్న హైదరాబాద్..సకీబ్‌కు అవకాశమిచ్చి ప్రోత్సహించింది. బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ స్కౌటింగ్‌లో దొరికిన సకీబ్ ప్రస్తుతం హైదరాబాద్ తురుపుముక్కగా మారాడు. వైవిధ్యమైన పేస్‌తో బ్యాటర్లకు పరీక్ష పెడుతూ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని సకీబ్ విషయంలో మరోమారు రుజువు కాగా, ఈ యువ క్రికెటర్ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నది.





# చెన్నై చమక్.. కోల్‌కతాపై ఘన విజయం



చెన్నై: ఐపీఎల్‌లో మాజీ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్(సీఎస్‌కే) వరస విజయాల జోరు కొనసాగుతున్నది. లీగ్‌లో తొలుత తడబడ్డ చెన్నై ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయంతో గాడిలో పడింది. మంగళవారం సొంతగడ్డపై జరిగిన పోరులో చెన్నై 32 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై ఘన విజయం సాధించింది. దిగ్గజ మహేంద్రసింగ్ ధోనీ గైర్హాజరీలో బరిలోకి దిగిన చెన్నై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత సంజూ శాంసన్ (32 బంతుల్లో 48, 4ఫోర్లు, 3సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (29 బంతుల్లో 41, 4ఫోర్లు, 2సిక్స్‌లు) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 192/5 స్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7) మరోమారు ఘోరంగా నిరాశపర్చగా, గత మ్యాచ్ సెంచరీ హీరో శాంసన్..చెన్నైకి పెద్దదిక్కుగా మారాడు. ఆయూశ్ మాత్రె (17 బంతుల్లో 38, 6ఫోర్లు, 2సిక్స్‌లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. సీఎస్‌కే బ్యాటర్లకు మూకుతాడు వేస్తూ కోల్‌కతా స్పిన్నర్లు సునీల్ నరైన్ (1/21), అనుకూల్ రాయ్ (1/21), వరుణ్ చక్రవర్తి (3-0-26-0) పొదుపు పాటించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. రమణ్‌దీప్‌సింగ్(35), రోవ్‌మన్ పావెల్(31 నాటౌట్) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతావారు బ్యాట్లు ఝులిపించడంలో విఫలమై స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. నూర్ అహ్మద్ (3/21), కంబోజ్ (2/26) ధాటికి కోల్‌కతా ఘోరంగా కుదేలైంది. దీంతో ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడిన కోల్‌కతా నాలుగింటిలో ఓడి కనీసం బోణీ కొట్టలేకపోగా, చెన్నై వరుసగా రెండో విజయంతో ఆకట్టుకుంది.

శాంసన్, బ్రెవిస్ రాణించగా : తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా..చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. లీగ్‌లో విజయమెరుగని కోల్‌కతా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో విఫలమవుతూనే ఉన్నది. ఇప్పటికీ సరైన కాంబినేషన్ లేక చేజేతులా మ్యాచ్‌లను వదులుకుంటున్నది. చెన్నైతో మ్యాచ్‌లోనూ అదే సీన్ పునరావృతం అయ్యింది. కెప్టెన్ రుతురాజ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశామనుకున్న కోల్‌కతాకు శాంసన్, మాత్రె రూపంలో ప్రతిఘటన ఎదురైంది. లీగ్‌లో సెంచరీతో ఫామ్ అందుకున్న శాంసన్..మాత్రె జతగా కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ మూడు బంతులను శాంసన్ వరుసగా బౌండరీలు కొట్టి తన ఫామ్‌ను చాటుకున్నాడు. మరో ఎండ్‌లో మాత్రె..శాంసన్‌ను అనుసరించాడు. గ్రీన్ నాలుగో ఓవర్‌లో మాత్రె రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. అదే జోరు కొనసాగిస్తూ ఆరోరా ఆరో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన మాత్రె..రమణ్‌దీప్‌సింగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో శాంసన్ కూడా ఔట్ కావడంతో ఒత్తిడిలోకి వెళ్లిన చెన్నైని బ్రెవిస్ ఆదుకున్నాడు. సర్ఫరాజ్‌ఖాన్(23)తో కలిసి బ్రెవిస్ బౌండరీలతో చెలరేగాడు. మిడిల్ ఓవర్లలో కోల్‌కతా స్పిన్నర్లు కట్టుదిట్టం చేయడంతో పరుగుల రాక ఒకింత మందగించింది. లేకపోతే చెన్నై భారీ స్కోరు అందుకునేది.

కోల్‌కతా ఢమాల్ : బౌలింగ్‌లో ఒకింత ఆకట్టుకున్న కోల్‌కతా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. ఓపెనర్ ఫిన్ అలెన్(1) సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితం కాగా, సునీల్ నరైన్(24), కెప్టెన్ రహానే(28), రఘువంశీ(27) క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. రింకూసింగ్(6), గ్రీన్(0) మరోమారు ఘోరంగా విఫలమయ్యారు. ఆఖర్లో రమణ్‌దీప్‌సింగ్(23 బంతుల్లో 35, 4ఫోర్లు, సిక్స్), పావెల్(22 బంతుల్లో 31 నాటౌట్, ఫోర్, రెండు సిక్స్‌లు) చెలరేగినా సాధించాల్సిన లక్ష్యం పెద్దగా ఉండటంతో గెలుపు సాధ్యం కాలేదు.




# భారత్ వృద్ధికి... క్రూడ్ కోత!

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరింత పెరిగి బ్యారెల్‌కు 130 డాలర్లకు చేరితే భారత్ ఆర్థిక వృద్ధి రేటుపై 80 బేసిస్ పాయింట్ల (0.8 శాతం) మేర ప్రభావం పడొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. బలమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, పటిష్టమైన ఆర్థిక రంగంతో చమురు ధరల పెరుగుదలను భారత్ తట్టుకోగలదని పేర్కొంది. "చమురు ధరలు పెరిగితే ప్రభుత్వ ద్రవ్య లోటు లక్ష్యాలకు కొంత ఆటంకం కలగొచ్చు. కానీ భారత్ 'సావరిన్ రేటింగ్' పై తక్షణమే ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు"అని ఎస్అండ్‌పీ స్పష్టం చేసింది. ఒకవేళ మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గి, చమురు సరఫరా సాధారణ స్థితికి వస్తే.. భారత్ తిరిగి పుంజుకుంటుందని నివేదిక పేర్కొంది. ౖ చమురు ధరల పెరుగుదల వల్ల గృహ వినియోగం, కార్పొరేట్ లాభాలు, బ్యాంకింగ్ రంగంపై ఒత్తిడి పెరుగుతుంది. దీనివల్ల జీడీపీ వృద్ధి రేటు మందగించే అవకాశం ఉంది.

# జీఎస్‌టీ 2.0: భారీగా పెరిగిన వాహన విక్రయాలు

దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం (202526)లో ద్విచక్ర, త్రిచక్ర, వాణిజ్య, ప్రయాణిక వాహనాలన్నీ కలిపి రికార్డు స్థాయిలో 2,82,65,519 యూనిట్లు అమ్ముడయ్యాయి. 202425లో నమోదైన 2,56,09,399 యూనిట్లతో పోలిస్తే ఇవి 10.4 శాతం అధికం అని వాహన తయారీదారుల సమాఖ్య సియామ్ మంగళవారం తెలిపింది. జీఎస్‌టీ 2.0 అమలు, ఆర్‌బీఐ రెపో రేట్ల కోతలు ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయని సియామ్ పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదుల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)పై వాహన పరిశ్రమ సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేసింది. అయితే, పశ్చిమాసియా యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే డిమాండ్, సరఫరా గొలుసు, వాహన ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ముడి చమురు, కమోడిటీ ధరల పెరుగుదల, మారకపు విలువల పెరుగుదల, షిప్పింగ్ మార్గాల్లో అంతరాయాలు ఆటో రంగానికి సవాళ్లుగా ఉన్నాయని తెలిపింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగితే 202627లో వాహన రంగం వృద్ధి మరింత వేగం అందుకుంటుందని సియామ్ ఆశాభావం వ్యక్తం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి వాహన ఎగుమతులు 24 శాతం పెరిగి 53,62,884 యూనిట్ల నుంచి 66,47,685 యూనిట్లకు చేరుకున్నాయి.

